క్లుప్తంగా

క్లూస్ టీమ్ తనిఖీ



దొంగతనం జరిగిన ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

కోసిగి: మండల కేంద్రంలోని 5వ వార్డులో నివాసం ఉంటున్న గట్టు వెంకటేష్ ఇంట్లో గత 29వ తేదీన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన విషయం విదితమే. బాధితుడు కుటుంబ సభ్యులతో కలిసి షిరిడీ సాయిబాబా దర్శనార్థం వెళ్లి మంగళవారం గ్రామానికి చేరుకున్నారు. చోరీ విషయం తెలిసినప్పటి నుంచి ఆ ఇంటికి పోలీసులు తాళం వేసి పర్యవేక్షించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మంగళవారం కర్నూలు నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించి ఏఎస్ఐలు నాగరాజు, మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో దుండగుల వేలి ముద్రలను సేకరించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

విద్యార్థిని శివలింగమ్మకు సన్మానం



శివలింగమ్మను సన్మానిస్తున్న డాక్టర్ ఈరన్న

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఐక్యరాజ్య సమితి, వరల్డ్ బ్యాంక్, అమెరికా అధ్యక్ష సౌధం సందర్శించి తిరిగివచ్చిన పొదలకుంట గ్రామానికి చెందిన శివలింగమ్మ, ఆమె తల్లిదండ్రులు సోమనాథ్, గంగమ్మలను కర్నూల్ అమీలియా ఆసుపత్రి వారు ఘనంగా సన్మానించారు. మంగళవారం ఆసుపత్రి వైద్యుడు ఈరన్న ఆధ్వర్యంలో వారికి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామ ప్రతిష్టను విదేశాలకు చాటిచెప్పిన విద్యార్థిని శివలింగమ్మను అభినందించారు. శివలింగమ్మ మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ-2 పరీక్షలు ప్రారంభం



డౌన్‌లోడ్ చేసిన పశ్న పత్రాన్ని చూపుతున్న ఉపాధ్యాయుడు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఫార్మేటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ) – 2 పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 1 నుంచి 10వ తరగతి వరకు నిర్దేశించిన సిలబస్ ప్రకారం పరీక్షలకు గంట ముందు విద్యాధికారులు ఆయా పాఠశాలలకు ప్రశ్న పత్రాలను పంపించారు. ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుడి మొబైల్ యాప్ నుంచి ప్రశ్న పత్రాలను డౌన్‌లోడు చేసి ప్రశ్నలను విద్యార్థులకు వివరించారు. ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం ఒకటి, మధ్యాహ్నం ఒక పరీక్ష నిర్వహించారు. 6, 7, 10 తరగతులకు మధ్యాహ్నం పరీక్ష నిర్వహించారు. 8, 9 తరగతులకు సీబీఎస్ఈ విధానంలో పరీక్షలను నిర్వహించేందుకు వాయిదా వేశారు. వాటిని కూడా 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సమాధాన పత్రాల మూల్యాంకనం తర్వాత ఆన్‌లైన్ పోర్టల్‌లో మార్కులను నమోదు చేస్తారు.

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



ఆర్‌యూ వైస్ ఛాన్స్‌లర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: తరగతులు నిర్వహించని బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి బాలు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆనందరావు దిష్టి బొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలలు దూర విద్యలాగా కొనసాగుతున్నాయని ఆరోపించారు. తరగతులు నిర్వహించకపోయినా విద్యార్థులను పరీక్షలకు హాజరుపరిచి ఉత్తీర్ణులు చేస్తుడడం వల్లే పక్క రాష్ట్రాల నుంచి అనేక మంది విద్యార్థులు కోర్సుల్లో చేరడానికి ఎగబడుతున్నారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు హరికృష్ణ, వినోద్‌రెడ్డి, విష్ణు, నరసింహ, రమాకాంత్, రంగ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఎమ్మిగనూరురూరల్: సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన కార్లు, ఆటోలు, మోటార్ బైకులను బుధవారం డీఎస్పీ కార్యాలయం ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు టౌన్ సీఐ మధుసూదన్ రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.






ఆదోనిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు, ధణాపురంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీడీఓ గీతావాణి దంపతులు, కోసిగిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ అయ్యమ్మ, వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వైస్ ఎంపీపీ ముత్తమ్మ

మంత్రాలయంలో వైద్య చికిత్స కోసం వృద్ధురాలిని తీసుకొస్తున్న వలంటీర్ దస్తగిరిమ్మ



ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- ఆదోనిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన
- మెరుగైన వైద్య సేవలపై హర్షం



చిరుధాన్యాలతో తయారు చేసిన పాయసం రుచి చూస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్, పక్కనే ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ అధికారులు

ఆదోనిటౌన్: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఇంటి వద్దకే అందిస్తుండడం ఆదర్శనీయమన్నారు. మంగళవారం 8వ వార్డు అరుంజ్యోతి నగర్‌లోని నోబుల్ వొకేషనల్ కళాశాలలో 1, 2, 3, 4, 5, 6, 8, 16 వార్డులకు సంబంధించి వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, చైర్‌పర్సన్ శాంత ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వైద్యశిబిరాన్ని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి ప్రారంభించారు. శిబిరానికి హాజరైన వారిని ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

నోబుల్ ఒకేషనల్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆరు వార్డుల పరిధిలోని ప్రజలు ఒక్కసారిగా తరలివచ్చారు. ఒక్కొక్క వ్యాధికి, ఒక్కొక్క శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. చికిత్సలు అవసరమైన వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. పది మంది డాక్టర్లు, పదుల సంఖ్యలో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీలు సేవాభావంతో ప్రతిఒక్కరినీ పలకరిస్తూ వారి సమస్యను తెలుసుకుంటూ సంబంధిత డాక్టర్ల వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. కౌన్సిలర్లు నరసింహులు, చలపతి, చిన్నా, రఘునాథ్‌రెడ్డి, అశోక్, పట్టణ కన్వీనర్ మధుసూదన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప, సుధాకర్, ఆనంద్, మహిళా నాయకురాళ్లు జిలేకాబీ పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీఓ గీతావాణి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ధణాపురం గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి చికిత్సల అందించారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు చేసి మందులను అందించారు. చిన్నపిల్లల వైద్యుడు మహేష్, జనరల్ సర్జన్ వినయ్‌రెడ్డి, పెద్ద హరివాణం డాక్టర్ ఇమ్రాన్‌అహ్మద్, పెద్దతుంబళం వైద్యులు నీలోఫర్ పాల్గొని వైద్య సేవలందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహమూర్తి, డీటీ వలీబాషా, ఈఓపీఆర్‌డీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో చిరుధాన్యాల స్టాళ్లు ఏర్పాటు చేసి పౌష్టికాహారం ప్రయోజనాలపై ప్రజలకు వివరించారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

మంత్రాలయం: పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని మంత్రాలయం వైఎస్సార్‌సీపీ నేతలు జి.భీమారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రాఘవేంద్రనగర్‌లో సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య నేతృత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అలాగే అధికారులు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం వైద్య పరీక్షలు పొందిన వారికి ఉచితంగా మందులతో పాటు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, ఎంపీడీఓ మణిమంజరి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ ప్రభావతి, ఏపీఓ తిమ్మారెడ్డి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

కోసిగి: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నేదే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని తహసీల్దార్ రుద్రగౌడ, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కోసిగి సచివాలయం-5 పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో డాక్టర్ నజీర్ అహ్మద్, డాక్టర్ అభిరూప్, డాక్టర్ రజిత ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ ఈరన్న, గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యుడు బుళ్లి నరసింహులు జగనన్న సురక్ష క్యాంప్‌ను పర్యవేక్షించారు. శిబిరంలో 346 మంది వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కంటి అద్దాలు అందించారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యులు షమీఉల్లా, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.



కౌతాళంలో వృద్ధురాలికి కళ్లజోడు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

పెద్దకడబూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో సచివాలయం- 1 పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి రిపోర్ట్‌లతో పాటు ఉచిత మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను సందర్శించారు. వైస్ ఎంపీపీ ముత్తమ్మ, గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప, డాక్టర్లు శాంతిజ్యోతి, రవిచంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేశారు



నేను కంటి సమస్య ఉండడంతో ఇబ్బంది పడేవాన్ని. గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలు ఇచ్చేలా చేస్తామన్నారు. మాలాంటి నిరుపేదలకు ఉచితంగా కంటి అద్దాలను ఇస్తామని చెప్పారు. మాలాంటి వారికి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలు అందించడం సంతోషంగా ఉంది.

– రాము, ధణాపురం గ్రామం

బీపీ, షుగర్‌కు మందులు ఇచ్చారు



నేను గత కొన్నేళ్లుగా బీపీ, షుగర్ జబ్బులతో బాధపడుతున్నాను. ఆస్పత్రిలో చూపించుకునే స్తోమత లేక బాధను అలాగే భరిస్తూ వచ్చాను. వయసు మీద పడడంతో మరింత ఎక్కువ అయిపోయింది. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా గ్రామంలోనే ఇలాంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఊరిలోనే వైద్య చికిత్సలు అదించడం సంతోషంగా ఉంది.

– ఈరమ్మ, ధణాపురం గ్రామస్తురాలు

గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలు

కౌతాళం: పేద ప్రజల ఇళ్ల వద్దకే వైద్య సేవలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. కౌతాళం జెడ్పీహైస్కూల్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టిందని గుర్తుచేశారు. నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఇళ్ల వద్దకే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. అనంతరం పలువురికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. సర్పంచ్ పాల్‌దినకర్, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, జెడ్పీటీసీ రాధ ప్రియదర్శిని, ఉరుకుంద ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, మహబుబ్‌సాహెబ్, ప్రహ్లాదాచారి, నోడల్ వైద్యాధికారి బాలమురళికృష్ణ, తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు, వైద్యులు ఇమ్మానుయల్, శిరీష, నాయకులు పాల్గొన్నారు.




ఆదోనిలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది, ఆదోని శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్



మంత్రాలయంలో కేస్‌షీట్‌లను అందిస్తున్న నాయకులు



కౌతాళంలో శిబిరానికి హాజరైన ప్రజలు

గడప గడపలో సంక్షేమ వెలుగులు



హాల్వీలో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి

కౌతాళం: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంట్లో సంక్షేమ వెలుగులు నిండాయని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని హాల్వి గ్రామంలో మంగళవారం పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యులు వై.ప్రదీప్‌కుమార్‌తో కలిసి దాదాపు 300 ఇళ్లను సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామస్తుల చెప్పుకొచ్చిన సమస్యలు ఆలకించి త్వరలో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అమోఘమన్నారు. పార్టీలకు అతీతంగా పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గత ప్రభుత్వాలు పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందజేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా చంద్రబాబు కాలంలో జన్మభూమి కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, వైఎస్సార్ పంట బీమా, చేదోడు, పింఛన్ కానుక పథకాలు పేదలకు వరంగా మారాయన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ తమకు మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. మాజీ సీఎం చంద్రబాబు చేసిన అవినీతి వల్ల నేడు జైల్లో ఉన్నాడని, టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. సర్పంచ్ క్రాంతి, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, స్థానిక నేతలు చెన్నప్పధని, బసవధని, సిద్దన్నగౌడ్, ఏకాంబర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ల్యాండ్ కన్వర్షన్ పక్కాగా చేపట్టండి

నందవరం: రెవెన్యూ అధికారులు ల్యాండ్ కన్వర్షన్‌ను పక్కాగా గుర్తించి రికార్డులలో నమోదు చేయాలని, పంట నమోదు పక్కాగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం నందవరంతో పాటు ధర్మపురం గ్రామాల్లో పర్యటించి లాండ్ కన్వర్షన్‌ను, పంట నమోదును సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సమగ్ర రీ సర్వేతో పాటు ల్యాండ్ కన్వర్షన్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మండలంలో పంట నమోదు 99 శాతం పూర్తయిందని, రైతులతో ఈ-కేవైసీ కూడా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పంట నమోదు, ఈ-కేవైసీ, సమగ్ర రీ సర్వే త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ నిత్యానందరాజు, ఆర్ఐ జెర్మియా, మండల సర్వేయర్ అబ్బర్‌బాషా, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు ఉన్నారు.



ధర్మాపురంలో భూ రికార్డులను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఇంటింటా ఆరోగ్య సర్వే



వైద్య పరీక్షలు చేస్తున్న ఎఎన్ఎం, ఆశావర్కర్లు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని విజయభాస్కర్ రెడ్డి కాలనీలో ఇంటింటా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం ఎఎన్ఎం, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కుటుంబంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ఎలా ఉపయోగించుకోవాలో ఏఏ వ్యాధులకు ఆరోగ్యశ్రీ వర్తిస్తుందో వంటి వివరాలను తెలియజేస్తున్నారు.

నేటి జగనన్న సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్

- ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామ సచివాలయంలో డాక్టర్ శాంతి జ్యోతి పర్యవేక్షణలో వైద్య శిబిరం
- కోసిగి-2 హిందూ బాలికల ఉన్నత పాఠశాలలో డాక్టర్ మనోజ్‌కుమార్ పర్యవేక్షణలో వైద్య శిబిరం
- కౌతాళం మండలం రౌడురు గ్రామం విలేజ్ హెల్త్ క్లినిక్, గ్రామ సచివాలయ కేంద్రంలో డాక్టర్ షేక్ అయేషాజోబియా పర్యవేక్షణలో వైద్య శిబిరం
- మంత్రాలయం మండలం కచ్చాపురం గ్రామంలో డాక్టర్ పి.వసంత పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు.

ప్రజల గుండెల్లో జగనన్నకు సుస్థిరస్థానం

ఆదోని రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించడం ఖాయమని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు, కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందారని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం దొడ్డనగేరిలో గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 300కి పైగా ఇళ్లను కలియతిరిగి ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. మేనిఫెస్టోలో ప్రకటించిన 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ప్రజాధనం స్వాహా చేసి ప్రస్తుతం జైలులో ఉన్నాడని, ఔటర్ రింగ్ రోడ్డు స్కాంలో కూడా శిక్ష అనుభవించాల్సిందేనని చెప్పారు. ఆయన తనయుడు నారా లోకేష్, ఇతర మాజీ మంత్రులు కూడా త్వరలో జైలుకు పోతారన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ కనుమరుగు అవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, నాయకులు ఆనంద్, బడాయి పంపాపతి, ఆర్ఐ జయరామిరెడ్డి, పీఆర్ఏఈ మాలిక్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, తాలుకా సీఐ నిరంజన్‌రెడ్డి, పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య, విశ్వనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దొడ్డనగేరిలో సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

గ్రామాభివృద్ధికి కృషి

కౌతాళం: గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడుపుదాం అని బాపురం గ్రామ సర్పంచ్ శిల్పా పిలుపునిచ్చారు. మంగళవారం గ్రామ ఇన్‌చార్జ్ గురునాథ్‌రెడ్డితో కలిసి గ్రామసభను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ, వీధి లైట్లు, సీసీ రోడ్లు, వివిధ సమస్యలను త్వరలోనే ఎమ్మెల్యే బాలానాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యదర్శి అబ్దుల్‌వాహిద్, ఉప సర్పంచ్ రామాంజనేయులు, వార్డు మెంబర్లు, గృహసారథులు, ఆశావర్కర్లు, నాయకులు పాల్గొన్నారు.

హక్కుల కోసం మాట్లాడితే నోటీసులా?

ఆదోని సెంట్రల్: మానవ హక్కుల పరిరక్షణ కోసం మాట్లాడితే ఎన్ఐఏ నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ఏఐడీఏ కన్వీనర్ ఆదినారాయణ, ఏపీఆర్‌సీఎస్ జిల్లా కార్యదర్శి సుంకన్న, పీఓడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షురాలు సుజ్ఞానమ్మ ప్రశ్నించారు. మంగళవారం వారు మాట్లాడుతూ మానవ హక్కుల కోసం ఉద్యమిస్తున్న యూజీ శ్రీనివాసులుపై కేంద్ర దర్యాప్తు సంస్థ దాడి చేయడం సరికాదన్నారు. ఆయన ఏరోజూ చట్ట వ్యతిరేక కార్యాకలపాలకు పాల్పడలేదని అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం విడ్డూరంగా ఉందని వాపోయారు. ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేశారన్నారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించకుండా కేంద్ర ప్రభుత్వం నడుచుకోవాలన్నారు. ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: కోసిగి మీదుగా ఆదోనికి వెళ్లే ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా మారిన గుంతలను ఎంపీపీ ఈరన్న, గ్రామ సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో తాత్కాలికంగా మట్టి వేసి పూడ్చారు. ఇటీవల ఆ రోడ్డులో బైక్‌లు అదుపుతప్పి ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ప్రయాణికులు, స్థానిక ప్రజలు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ అయ్యమ్మతో మాట్లాడి వెంటనే రోడ్డుకు తాత్కాలికంగా గరుసు మట్టిని వేసి పూడ్చేశారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాణిక్యరాజు, రాజేష్ ఉన్నారు.

రహదారికి మరమ్మతులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆదోని సెంట్రల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పేర్కొన్నారు. మంగళవారం అగ్రికల్చర్ కార్యాలయంలో రైతులకు సబ్సిడిపై శనగ విత్తనాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. విత్తనం వేయకముందు నుంచి పంటను మార్కెట్లో అమ్ముకునే వరకు రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్స్‌రెన్స్ సకాలంలో అందిస్తున్నట్లు చెప్పారు. శనగ విత్తనాలు క్వింటాలు ధర రూ.8100 ఉండగా సబ్సిడి 40 శాతం రూ.3240 పోనూ రైతు వాట కింద రూ.4860 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. శనగ విత్తనాలు కావాల్సిన వారు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, నాయకులు బి.పంపాపతి, శేషిరెడ్డి, గురునాథరెడ్డి, రామలింగేశ్వర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్

రైతు సంఘాల నిరసన

కౌతాళం: కేంద్ర ప్రభుత్వం అమలు చేయదలచిన మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని లకీంపూర్‌కేరిలో రైతులు చేస్తున్న ప్రదర్శనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు కారుతో తొక్కించిన ఘటన (అక్టోబరు 3)ను నిరసిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, రైతు కూలీ సంఘం కార్యదర్శి జగదీష్ ఆధ్వర్యంలో స్థానిక వాల్మీకి సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2020లో రైతు వ్యతిరేక విధానాలకు నిరసగా రైతులు 365 రోజులు పోరాటాలు చేశారని, ఈ పోరాటంలో దాదాపు 750 మంది రైతులు ప్రాణత్యాగం చేశారన్నారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని, నిరసనలో పాల్గొన్న రైతులపై పెట్టిన కేసుల్ని ఎత్తివేయాలని, రైతు రుణాలు మాఫీ చేయాలని డిమాండు చేశారు. రైతు సంఘాల నాయకులు ఈరన్న, ఉలిగయ్య, రామలింగ, సత్యప్ప, మూకప్ప, నాగేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు